# రుద్రైకాదశినీ

అతిరుద్ర మహాయాగములో ఏకాదశ రుద్రులనూ, స్తుతిస్తూ శివానుగ్రహాన్ని పొందించే స్తోత్రముతో కూడినదే ఈ యాగ స్మరణిక.

యజుర్వేదములో చెప్పిన రుద్ర గణ నామాలు - ప్రభ్రాజమాన, వ్యవదాత, వాసుకి వైద్యుత, రజత, పరుష, శ్యామ, కపిల, అతిలోహిత, ఊర్ధ్వ, అవపతంత, వైద్యుత – అని. శైవాగమములో శంభు, పినాకి, గిరిశ, స్థాణు, భర్గ, సదాశివ, శివ, హర, శర్వ, కపాలి, భవ – అని 11 నామాలను తెలిపారు. ఈ రెండిటిని సమన్వయం చేస్తూ, 11 శ్లోకాలతో పరమేశ్వరుడు గురురూపంగా స్తుతించబడుతున్న ఈ స్తోత్రమే రుద్రైకాదశిని.

- **శమ్భుః పినాకీ గిరిశ-స్స్థాణుర్భర్గస్సదాశివః।**
- **శివో హరస్తథా శర్వః కపాలీ భవ ఏవ చ।**
- **రుద్రా ఏకాదశ ప్రోక్తాః సృష్టి స్థిత్యన్త కారకాః॥**
- **ప్రభ్రాజమానా వ్యవదాతా వాసుకివైద్యుతా రజతాః పరుషాః శ్యామాః కపిలా అతిలోహితా ఊర్ధ్వా అవపతన్తా వైద్యుతా ఇతి శ్రుత్యుక్తా ఏకాదశ గణాః॥**

దీనిలోని శ్లోకాలన్నీ ముక్తక ప్రక్రియలో ఉన్నాయి. ముక్తకమనగా ఏ శ్లోకానికి ఆ శ్లోకానికే అన్వయం ఉంటుంది. ప్రతి శ్లోకం స్వతంత్రంగా ఉంటుంది. ఇందులోని శివగురువు శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ గురుదేవులే. ఇందులో

భక్తుడు శివునితో స్వయంగా సంభాషణ చేస్తాడు. తన కోరికను పరమశివునకు నివేదన చేస్తాడు. తనకు ఏది కావాలో నిర్భయంగా అడుగుతాడు. తన మనస్సును శివార్పణం చేస్తాడు. సర్వం శివమయం జగత్తు అంటాడు.

ఒక భక్తుడు భగవంతునితో నేరుగా మాట్లాడుతున్నట్లుగా ఈ కావ్యం కనిపిస్తుంది. అటువంటి 11 శ్లోక బిల్వములు శ్రీస్వామీజీవారి అంతేవాసి వంశీ కృష్ణ ఘనపాఠీ ద్వారా వెలువడి, శివారాధనలో వినియోగమై, భక్తులకు యాగ ప్రసాదంగా అందుతున్నది.

**1 శమ్భుః - ప్రభ్రాజమానాః**

**శమ్భో శాశ్వత సర్వకామద మహా మాయాధినాథ ప్రియ**
**భక్తాభీష్ట దదాన సర్వ సదయ ప్రభ్రాజమాన ప్రభో।**
**స్వాత్మజ్ఞాన విభూతి ముత్తమ రయిం దేహి ప్రసిద్ధాం తవ**
**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 1॥**

ఓ! పరమేశ్వర! శివగురో! నీకు సంబంధించిన నీ దగ్గర మాత్రమే గల సచ్చిదానంద తత్త్వాన్ని నాకు అనుగ్రహించు అని భక్తుడు ప్రాధేయపడుతున్నాడు. సర్వశుభాలను అనుగ్రహించు శంభో! శాశ్వతమైన మోక్షమును ఇచ్చువాడా! మహామాయకు అధినాయకుడా! ప్రియమైన భక్తులయొక్క కోరికలను తీర్చువాడా! నిరంతరం ప్రకాశించు స్వభావం కల పరమశివా! ఆత్మజ్ఞానమనే సుప్రసిద్ధమైన అత్యుత్తమమైన మహదైశ్వర్యాన్ని నాకు అనుగ్రహించు.

2 పినాకీ- వ్యవదాతాః

సర్వేశాన పినాకిన స్త్రిపురసం హర్తుః కృపా వీక్షయా

ద్వైధీభావ విపత్తయ స్సపది మే గ్లాయన్తు శోకాస్పదాః।

సేవేహం వ్యవదాత రుద్ర మనిశం త్వాం వేదవేద్యం విభుం

దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 2

స్థావర జంగమాత్మకమైన ఈ ప్రపంచమునకు ప్రభువైన వాడా! త్రిపురములు అను రాక్షసులను సంహరించిన వాడా! పినాకము అను ధనుస్సు చేతియందు కల పరమశివుని యొక్క దయామయమైన చూపుతో నా మనస్సులో గల ద్వంద్వ ప్రకృతులతో కూడిన శోకమునకు కారణమైన వాటిని నాశనము చేయు గాక. కోరిన కోరికలను వెను వెంటనే తీర్చు స్వభావముగల తెల్లని శరీరకాంతి గల వేదవేద్యుడైన పరమశివుని నిరంతరం సేవించుచున్నాను. శివగురో నీయొక్క సచ్చిదానంద తత్త్వాన్ని నాకు అనుగ్రహించు.

3 గిరిశః - వాసుకివైద్యుతాః

వన్దే వాసుకి వైద్యుతాఖ్య గిరిశం నిత్యం శయానం గిరౌ

సర్వస్మిన్నపి సాక్షిమాత్ర మజరం కూటస్థ మీహాతిగమ్।

అక్షయ్యం ప్రముదా భజామి మనసా త్వామేవ సప్రశ్రయో

దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 3।

కైలాసపర్వతం మీద నివసించు వాడు, వాసుకి వైద్యుత మొదలైన రుద్రగణములకు అధిపతియైన వాడు, సమస్తమైన జగత్తునకు సాక్షిమాత్ర చైతన్యమైన వాడు, స్వేచ్ఛారూపము ధరించువాడు, అయిన పరమేశ్వరుని వినయవిధేయతలో భక్తిశ్రద్ధలు నిండిన మనస్సుతో సేవించుచున్నాను. నాశనము లేని అఖండ ఆనందరూపమునూ, సచ్చిదానంద తత్త్వమును అనుగ్రహించు గాక.

**4 స్థాణుః - రజతాః**

**స్థాణుత్వే జడతా రజోమయగుణః కార్యక్రమారమ్భణే**

**త్యక్త్వేమా.వథ సంవసేయ మధునా సత్త్వైక మార్గానుగః।**

**సంగృహ్యాక్ష మనో మయా హి రజతే రుద్రే త్వయి న్యస్యతే**

**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 4**

సత్త్వరజస్తమో గుణాలలో సత్వగుణమార్గాన్ని మాత్రమే ఇష్టపడుతున్నాను. స్థాణువులా జీవిస్తే జడుడు అంటారు. ఇది తమోగుణ లక్షణం. అన్ని పనులను సక్రమంగా పూర్తి చేస్తే అందులో రజోగుణం కనిపిస్తుంది. అందు వలన రజస్తమో గుణాలను విడిచి పెట్టేస్తాను. నా యొక్క ఇంద్రియాలను మనస్సును నిగ్రహించి ఎల్లవేళల రుద్రుని యందు మాత్రమే ప్రవర్తింపచేస్తున్నాను. శివగురో! నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని పరమేశా! నాకు అనుగ్రహించు. !

(అక్షశబ్దం ఇంద్రియాలకు సంకేతం. మనస్సుకూడ ఇంద్రియములవంటిదే అని భగవద్గీత చెబుతున్నది.. కాబట్టి, ఇంద్రియాలనన్నిటినీ భగవంతుడిలో లయం చేయాలని భావం)

**5 భర్గః - పరుషాః**

**భర్గం దేవ మిహేడయామి పరుషం రుద్రం భవన్తం ముదా**

**భ్రజ్జస్వాత్ర మహౌఘ సఞ్చితి మపి ప్రారబ్ధ మాశుప్రముత్।**

**ధ్యాయేऽహం భవదీయ చిత్ర చరితం దక్షాధ్వర ధ్వంసక**

**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 5**

హే శివగురో! నిన్ను రుద్రునిగా భర్గునిగా ఎల్లప్పుడూ సంతోషంతో పూజిస్తున్నాను. భోళాశంకరుడవై వెంటనే సంతోషపెట్టగల నీవు నా యొక్క ప్రారబ్ధ ఆగామి సంచిత మైన పాపసమూహాన్ని నాశనం చేయాలి. చిత్రవిచిత్రమైన నీ యొక్క చరిత్రను, లీలా విలాసాదులను దక్షుని యాగాన్ని ధ్వంసం చేసిన విధానాన్ని స్మరిస్తూ నిన్ను ధ్యానిస్తూనే ఉన్నాను. శివగురో! నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని నాకు అనుగ్రహించు. స్వామీ!

**6 సదాశివః - శ్యామాః**

**శ్యామం రుద్ర విభుం సదాశివ మహం సఞ్చిన్తయే త్వాం సదా**

**శాన్తం దాన్త.మభిష్టుతోऽస్మి నిరతం షాడ్గుణ్య రాయం దిశ।**

**త్వన్నామామృత పాన మత్త మధుపో బోభోమి గౌరీపతే**

**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 6।**

చరాచరజగత్తునకు ప్రభువైన రుద్రా! సదాశివ! నేను ఎల్లవేళల నిన్ను సేవిస్తున్నాను. శాన్త, దాన్త, యమ, దమాది షడ్గుణ సంపత్తిని నీ నుండి నేను

కోరుచున్నాను. హే గౌరీనాథా! నీ యొక్క నామామృతాన్ని తనివితీరా త్రాగి మత్తెక్కిన తుమ్మెద వలె ఉంటున్నాను. శివగురో! నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని నాకు అనుగ్రహించు. స్వామీ

7 శివః - కపిలాః

స్వామిన్ భో శివ దేవ రుద్ర కపిల ప్రశ్నం మమైకం వద

యైషా చిత్ర విచిత్ర సత్త్వ జగతీ త్వన్మూర్తి.రేవేరితా।

కిన్త్వస్యాం భవదీయ మక్షయ సుఖం న న్యాసి కా తే ఘృణా?

దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 7

ఓ! స్వామీ! శివ! రుద్ర! కపిల! నా యొక్క ప్రశ్నకు సమాధానం చెప్పు. చిత్ర విచిత్రాలతో సత్వరూపమైన ఈ జగత్తు నీ యొక్క రూపమనే కదా వేదాలు చెప్తున్నాయి. నీ యొక్క రూపమైన ఈ జగత్తులో నాశనము లేని సుఖాన్ని నీవు ఎందులకు ఉంచలేదు? ఈ విషయములో నీకెందుకింత ఉపేక్ష? నా ప్రశ్నకు సమాధానముగా నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని నాకు అనుగ్రహించు స్వామీ.

8 హరః - అతిలోహితాః

కామాహ న్నతిలోహితేశ్వర హర క్రవ్యాద రాజార్చిత

పూజాం బిల్వదలై స్సుమై స్సురభిలై ర్భక్తివ్రతీ శ్రద్ధయా।

రుద్రాధ్యాయ జపార్చనాహుతివిధిం ప్రేమాదరైః కల్పయే

దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 8।

మన్మథుని నాశనం చేసిన వాడా! అతిలోహితులని ప్రసిద్ధి చెందిన రుద్రగణానికి ప్రభువైన వాడా! రాక్షస రాజులచేత నిత్యము సేవింపబడు శివగురో! బిల్వదళాలతో పరిమళయుక్తములైన పుష్పాలతో శ్రద్ధాభక్తులతో నీకు పూజను చేయుచున్నాను. శతరుద్రీయాలతో జప అర్చన హోమాదులను యథా శాస్త్రముగా ప్రేమానురాగాలతో నీకు అర్పిస్తున్నాను. పరమేశా నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని నాకు అనుగ్రహించు స్వామీ.

కామాహన్న్ (మన్మథుని నాశనం చేసినవాడా) అనుటచే నా యొక్క మనసులోని కోరికలను నాశనం చేయమని ప్రార్ధన. అతిలోహితేశ్వర అనుటచే నా యొక్క భార్యాపుత్రులను, తల్లి తండ్రులను బంధువులను కూడ రక్షించు అని ప్రార్ధన. రాక్షసరాజులచే సేవింపబడు వాడా అనుటచే నా యొక్క మనస్సులోని తమోగుణములను దహించి నన్ను కాపాడమని నివేదించినట్టు తెలుసుకోవాలి.
ఈవిధముగా ఈ స్తోత్రాలలోని అన్ని సంబోధనలు సమయోచితమైన అర్ధాన్ని సూచిస్తున్నాయి.

**9 శర్వః - ఊర్ధ్వః**

**శర్వం రుద్ర మిహోర్ధ్వ నామక మహం ధ్యాయామి యస్య ప్రభా**

**సూర్యాచన్ద్రమసౌ కృశాను మరుతో దిక్పాలకాన్ లోకపాన్।**

**ఐశ్వర్యేణ సమస్త పాలక గణం సఞ్చాలయన్తీ సనా।**

**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 9।**

శివగురో నేను శర్వుని, ఊర్ధ్వనామకుడైన రుద్రుని ధ్యానిస్తున్నాను. దివ్యమైన నీయొక్క తేజస్సే సూర్యచంద్రులను, అగ్నిహోత్రుని, సప్తమరుత్తులను, లోకపాలకులైన దిక్పాలకులను, సనాతులైన సమస్తపాలక గణములను, అష్టైశ్వర్యవంతులుగా, ప్రకాశవంతులుగా సమర్ధులుగా చేస్తోంది. శివగురో తేజో రూపమైన అట్టి సచ్చిదానందతత్త్వాన్ని అనుగ్రహించు స్వామీ.

**10 కపాలీ - అవపతన్తాః**

**సంసేవ్యో ऽవపతన్త రుద్ర మహిమా నిత్యం కపాలీ యది**

**తాపానాం త్రితయస్య సేవనమిదం నేష్యేత చిన్తాకులైః।**

**సంవ్యా.వర్తయితుం స్మరామి తదతస్తస్మాద్విభో త్వాం భవన్**

**దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 10**

కపాలీ! అవపతన్త గణాధీశుడవైన రుద్రుడా! నీ యొక్క మహిమ సేవింపతగినది. చింతాగ్రస్తులైన వారి చేత ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవతక తాపములు చాలా దుఃఖాన్ని కష్టాన్ని కలిగిస్తాయి. దానికి వారు ఇష్టపడరు.వాటిని తప్పించుట కొరకై పరమేశా! నేను నిన్ను సేవిస్తున్నాను, నీ యొక్క సచ్చిదానందతత్త్వాన్ని నాకు అనుగ్రహించి వారి కష్టాలను కడతేర్చు స్వామీ.

**11 భవః - వైద్యుతాః**

**దేవం వైద్యుత రుద్ర మర్ధ వనితా దేహం భవం భావుకం**

**విద్యుద్ వృష్టి దయోపలిప్సు రమిత ప్రేమాదరై ర్భావయే।**

**సంశుద్ధే మమ మానసే పరతమం త్వాం హి ప్రతిష్ఠాపయే।**

దద్యా మే పరమేశ హే శివగురో త్వత్సచ్చిదానన్దతామ్। 11

ఓ! పరమేశా! నిన్ను అర్ధనారీశ్వరునిగ, భవునిగ, వైద్యుతగణాధీశునిగ, దేవదేవునిగ, అమితమైన ప్రేమాదరములతో పూజిస్తున్నాను. విద్యుత్ వృష్టి దయలను పొందాలనే కోరికలతో పరిశుద్ధమైన నా యొక్క మనస్సులో పరాత్పరుడవైన నిన్ను ప్రతిష్ఠాపించుకొనుచున్నాను.

నీ యొక్క సచ్చిదానందతత్వాన్ని నాకు అనుగ్రహించు స్వామీ.

ఫలశ్రుతిః

ఫలశ్రుతిః

సదభీష్టప్రదా మేతాం శివప్రీతికరాం శుభామ్।

రుద్రైకాదశినీం జప్త్వా శివసాయుజ్య మాప్నుయాత్।

సర్వాభీష్టకరమైన, శివప్రీతికరమైన, సర్వశుభకరమైన, ఈ రుద్రైకాదశిని ఎవరైతే నిత్యం పారాయణ చేస్తారో వారు శివసాయుజ్యాన్ని పొందుతారు.

సందర్భము-

అవధూత దత్తపీఠాధిపతులు పరమపూజ్య శ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వారు మైసూరులోని దత్తపీఠంలో స్వస్తిశ్రీ వికృతి సంవత్సర కార్తిక శుద్ధ షష్ఠి శుక్రవారం నుండి బహుళ పాడ్యమి వరకు అనగా 12-11-2010 నుండి 22-11-2010 వరకు అతిరుద్రయాగ మహాయాగానికై పూనుకున్నారు. 1985లోవారు స్థాపించిన వేదపాఠశాల రజతోత్సవ సందర్భముగా జరుగుతున్న

పవిత్రమైన మహాయాగమిది. విశ్వశాంతియే ధ్యేయంగా, లోకకల్యాణమే ఆదర్శంగా, సమస్త మానవాళి సుఖసంతోషాలతో ఆనందంగా జీవించడమే లక్ష్యంగా, ప్రముఖు న వేదవిద్వాంసులతో అతిరుద్రయాగం నిర్వహించబడింది.

ఇందులో 175 మందికి పైగా ఋత్విక్కులు ఉన్నారు. ప్రతి హోమకుండమువద్ద, ఒక్కొక్క విద్వాంసుడు ఆచార్యుడిగా హోమాన్ని నిర్వహిస్తాడు. ఈయనతో పాటుగా, ఇంకా 10 మంది హోమాన్ని చేస్తారు. వీరి పనులను పర్యవేక్షణ చేసే పండితుడిని బ్రహ్మ అంటారు. వీరితో పాటుగా, హోమ సహాయకులు, అభిషేకము చేసేవారు ప్రత్యేకంగా ఉంటారు. ఇలా పదకొండు హోమకుండాలలో, 11సార్లు రుద్రాధ్యాయ మంత్రాలను పారాయణ పూర్వకంగా హోమం చేస్తూ, 11 రోజులపాటు అపూర్వంగా జరిగే ఈ అతిరుద్ర మహాయాగానికి పూనుకున్న ఆస్తిక వరేణ్యుడు శ్రీ రాధాకృష్ణ రామచంద్ర అయ్యర్ (చికాగో) మరియు వారి కుటుంబసభ్యులు. వారి అభ్యర్థన మేరకు శ్రీస్వామీజీ నేతృత్వములో జరిగినది.

అతిరుద్ర యాగః 2010 కార్తికమాసః
అవధూత దత్త పీఠమ్, మైసూరు

స్తోతా- వంశీకృష్ణ ఘనపాఠీ
వ్యాఖ్యాతా – రాణీ సుబ్బయ్య దీక్షితః